నిజానికి, మనమంతా చిన్నతనంలో గాలిపడగలు ఎగరవేసిన వాళ్ళమే, బొంగరాలూ, గోళీబిళ్ళలూ ఆడినవాళ్ళమే. కాని, ఇప్పుడు, ఈ రోజున, ఈ పెద్దరికంలో గాలిపడగలు ఎగరవేయడమన్నా, బొంగరాలు త్రిప్పడమన్నా భిడియపడతాం; గొట్టికాయ లాడేవాళ్లనూ దూడుంపుల్లాట ఆడేవాళ్లనూ ఏవగించుకొని, మూర్ఖులంటాం.

దీనికి కారణం మనం అంతకన్నా పెద్ద ఆటలూ, గొప్ప ఆటలూ నేర్చుకుని వుండటమే నంటారు కొందరు మహనీయులు. కాని, క్లబ్బుల్లో పేకాట, గుంపులో కుమ్ములాటా, కోర్టులో దొమ్ములాట ఆ కోమటిపిల్లవాడి ఆనందంలాంటి స్వచ్ఛందమైన ఆనందాన్ని మనకు మనకు ఇస్తాయా, ఇవ్వగలవా? అని.

* * *

గాలిపడగలను కాదని మనం తప్పించుకుపోలేం, అవి మన జీవితపు టంచులు. మనం ఎంత తప్పించుకోవాలని చూసినా అవి మన జీవిత పరిహద్దులను అంటిపెట్టుకునే వుంటాయి. గాలి మనకు కావాలి. దాన్ని మనం అఖ్ఖర్లేదనలేం. అలానే గాలి పడగలుకూడాను. అవి మన ఊహాపథాల్లో విహరింపక మానవు.

---

# కృతజ్ఞతాభావం

కుక్కలు పూర్వకాలంలో తోడేళ్ళకు మల్లేవుండేవట. అందుచేతనే విజ్ఞానవేత్తలు తోడేలు చిక్కిపోయి కుక్కగా మారిందనీ, పంది బలిసిపోయి ఏనుగగా మారిందనీ తమ పరిశోధన గ్రంథాలలో వ్రాసి పెట్టారు.

ఈరోజున మనం చూసే కుక్కలకీ పూర్వకాలపు కుక్కలకీ ఎంతో వ్యత్యాసంవుంది, రూపంలోనే గాకుండా, చేష్టలలోనూ, నైజాల లోనూ, మానసిక ప్రవృత్తులలోనూ కూడా.

పూర్వం కుక్కలు అడవులలో వన్యమృగాలతో కలిసివుండేవి. మానవపరిసరాలంటే యేమిటో వాటికి తెలీదు. అడవి జంతువులకు మల్లేనే జీవిస్తూ ఆహారాన్ని వేటాడుకుంటూ భీకరంగావుండేవి.

అటువంటి జాతి ఈనాడు మానవ ప్రాంతాలకు వచ్చి, మానవుడి సాంగత్యంచేసి, పప్పుకూడూ, బద్ధకమూ మరిగి కొన్నికొన్ని గుణాలలో మానవుడి దౌర్భాగ్యాన్నే ప్రదర్శిస్తున్నాయి.

సుమతి వ్రాసి పెట్టాడు, కుక్కను మనం ఎందుకు అసహ్యించుకోవాలో. కాని, అతను వ్రాసింది సరికాదు. ఈరోజున నేను కుక్కను ద్వేషించి అసహ్యించుకుంటున్నానంటే, దీనికి కారణం సుమతి వాక్యం కాదు. మరోవిధంగా కుక్క అధఃపతనమైనందుకు-

కనకపు సింహాసనంమీద కుక్కను కూర్చుండబెట్టి శుభలగ్నమప్పుడు ఏదోచేస్తే అది మనం అనుకునేలా గాకుండా మరో విధంగా-ఛండాలంగా-ప్రవర్తించిందట. ఎవరిదయ్యా ఈ లోపం అంటే, కుక్కది కాదు, ఆ కనకపు సింహాసనంమీద దాన్ని కూర్చోబెట్టినవాడిది...అని చెప్పాలి.

అడవిలోంచివచ్చి మానవ పరిసరాల్లో నివాసం ఏర్పరుచుకున్న జంతువులు అనేకం వున్నాయి. పిల్లి అడవిలోంచి వచ్చినదే; ఆవులు, ఎద్దులూ, గేదెలూ, ఎనుబోతులూ, గుర్రాలూ, ఏనుగులూ ఇవన్ని అడవిలోంచివచ్చి మానవ వాసనను పీల్చడానికి అలవాటుపడినవే. కాని ఆ జంతువులలో ఏదీకూడా కుక్క పొందినంత మర్యాదనూ, నేస్త భావాన్ని మన దగ్గరనుంచి పొందలేదు. పాలు పిండిన పిమ్మట ఆవు జోలి మనకు అక్ఖర్లేదు. కొట్టాంలో కట్టివేస్తాం. లేకపోతే పొలాల్లోనూ, గడ్డి బీడులలోనూ తిప్పుతాం. గుర్రపు స్వారికాగానే దాన్నికూడా - ఎంత పంచకల్యాణి గుర్రాన్నైనా సరే-కొట్టాంలో కట్టివేస్తాం. రాజుగారు ఏనుగుమీద ఊరేగిరాగానే మళ్లీ ఊరేగింపువరకూ ఆ ఏనుగుతో ఏమీ జోక్యంపెట్టుకోరు. మిగతా జంతువుల స్థానంలోనే అదీ బ్రతుకుతుంది. పిల్లి మొదలైన జంతువులలో అసలు మనం (ఏ అమెరికన్లో

తప్ప) సంబంధం పెట్టుకోనే పెట్టుకోము. పోతే కుక్కలు: ఇది మన ఇళ్లలోనే మనతోబాటే తిరుగుతూ, మన తొడలమీద కూర్చుంటూ వుంటాయి. ఇంతేగాకండా, సుమతి చెప్పినదాన్నిబట్టి చూస్తే ఇవి కనకపు సింహాసనాలమీద కూడా ఎక్కి కూర్చున్నట్టు కనపడుతుంది. ఎందుకయ్యా ఈ జంతువుకి ఇంత మర్యాదా అంటే: అనేకులు అనేక కారణాలు చెబుతారు.ముఖ్యంగా, కుక్క చాలా కృతజ్ఞతగల జంతువు. అంచేత మానవుడికి ప్రాణబంధువు అంటారు. ఈ కుక్కకీ, మానవుడికీ గల ప్రాణ బంధుత్వాన్ని గురించి అనేకదేశాల్లో అనేక ఇతిహాసాలూ, పిట్టకథలూ, పుక్కిడి పురాణాలూ అమలులో వున్నాయి.

కృతజ్ఞత అనేది అర్థంలేని మాట. వాడుకలో, వ్యవహారికంలో దానికీ ఏదో అర్థం ఉండవచ్చు. కాని, లోతుకు పోయిచూస్తే ఈ కృతజ్ఞత అనేది గొప్ప స్వార్థంతో కూడుకునివుంది. స్వార్థమే లేక పోతే ఈ మాట అమలులోకి వచ్చివుండదు.

మీ పొరుగింట్లోకి కొత్తగా ఎవరోవచ్చి దిగుతారు. వాళ్లఆయన బియ్యం తేవడానికి బజారుకు వెడతాడు. రావడం ఆలస్యం అవుతుంది. అవతల ఎసరు మరిగిపోతోంది. "వారు వచ్చిన తర్వాత బదులు తీరుద్దురు గాని లెండి" అని మీ ఆడవాళ్ళు శేరు బియ్యం కొలిచి ఆ యిల్లాలికి యిస్తారు. ఆవిడ "మీరు ఎంతో మంచి వారండీ" అంటూ చాలా యిదవుతుంది. ఆ తర్వాత ఆవిడ ప్రతి విషయంలోనూ మీ ఆడవాళ్లకు కృతజ్ఞత చూపడానికి ఉత్సాహపడుతుంది - శేరు బియ్యం బదులియ్యడంతో ఆమె హృదయాన్ని, ఆమె కృతజ్ఞతనూ మీ ఆడవాళ్లు దొంగిలించారు.

ఆ మర్నాడు: "మా ఆయన ఆఫీసుకు వెళ్ళారు. గుమ్మంలో చీర బేరం చేశాను. ఆయన రాగానే అడిగి పుచ్చుకుని యిస్తాను ఒక్క అయిదు రూపాయలు..." అంటూ మీవాళ్లు ఆవిడ్ని అడుగుతారు,మాట తీసెయ్యలేదని తెలిసి.

నిజానికి ఆ కొత్తగావచ్చిన ఆవిడ దగ్గరకూడా డబ్బులేదు;

"అయ్యో పాపం! డబ్బంతా మావారిదగ్గరే వుంటుందండీ - నాదగ్గర యేమీ లేదు-మీరు నోరువిడిచి అడిగినందుకేనా ఇవ్వలేక పోయాను...." అని చాలా విచారిస్తుంది.

ఆవిడ విచారం మీ ఆడవాళ్ళకు అర్థమవుతుందా? కాదు. "కృతజ్ఞతలేనిమనిషి" అని ఆమెమీద నింద వేస్తారు!

వెనక నిరుద్యోగపు రోజుల్లో ఒక కమ్యూనిష్టు సోదరుడు నాకో చిన్న సహాయంచేశాడు - మరేమీ లేదు - ఒక రూపాయ బదులిచ్చాడు. అది నేను తిరిగి యిచ్చివేసి చాలాకాలం అయింది కూడాను. ఆ ఉపకారానికి కృతజ్ఞతగా ఈ రోజున నన్ను ఇప్పుడు జరుగుతూంజేది ప్రజాయుద్ధమని నమ్మమంటాడు—నా అభిప్రాయానికి వ్యతిరేకంగా!

ఇక్కడే వస్తుంది మనిషికీ కుక్కకీ లడాయి. నీవు చూపించలేని కృతజ్ఞత కుక్క చూపించడానికి సిద్ధపడుతుంది. మనిషి సహవాసంచేసి మనిషికంటే ఏడాకు లెగచదివింది కుక్క—

ఇన్ని రోజులూ అది రోడ్డుమీదనే పడుకునివుండి, దొంగచాటుగా తప్ప ఆహారం సంపాదించుకోలేని పరిస్థితి దానిది - ఆ కుక్కది. పుంజెడు మెతుకులు దానికి విసరండి. అవి తినకుండానే అది తోక ఆడించడం ప్రారంభిస్తుంది. తిని, మీ వెంటపడుతుంది. మీ యింట్లో జేరుతుంది. వృత్తినే నిష్ప్రయోజనంగా దాన్ని మీరు ఎల్లకాలం పోషించడానికి ఇష్టపడరు అనే సంగతి దానికి తెలుసును. అందుకని, తనంతటతానుగా —చేతినిండా పనిలేని ఉద్యోగస్తుడు ప్రియవచనాలతో యజమానిని తృప్తిపరచబోయినట్టుగా - ఒక కార్యభార్యాన్ని మీద వేసుకుని మిమ్మల్ని, మీపిల్లల్ని, మీ ఆస్తినీ అన్నిటినీ శత్రువులబారినుండి రక్షిస్తూన్నట్టుగా అభినయిస్తుంది. మీ పిల్లలు వీధులో ఆడుకుంటూంటారు. ఆవో, గేదో, ఆ దోవను పరుగెత్తుతుంది. మీ పిల్లలు భయపడి కెవ్వుమంటారు. ఏమిటా అనిచెప్పి మీరు అటువేపుచూస్తారు. వెంటనే మీ యింటి అంగరక్షకుడైన కుక్క ఆ ఆవునో, గేదనో తరుముతూ భీకరంగా అరుస్తుంది. మీరు చూస్తుంటే మరీ అట్టహాసం కనబరుస్తుంది.

నిజానికి ఆ ఆవునో, గేదెనో ఇటు తరిమింది అవతల వీధులోని మరో కుక్క - మీ కుక్కవంటిదే - ఈ కుక్కలన్నీ ఒకదానితో ఒకటి లాలూచీ! అవతల వీధులోని కుక్క నిష్కారణంగా ఒక దౌర్భాగ్యుడి మీదపడి తరుముతుంది. అతడు మీ వీధివెంట, మీ గుమ్మంలోంచి పరుగెడుతాడు. మీరు వాడినిచూచి "దొంగ" అని భయపడతారని మీ కుక్కకు బాగా తెలుసును. అవతల వీధి కుక్కకు జవాబుగా మీ కుక్క ఆ మానవుడ్ని తరమడం ప్రారంభిస్తుంది.

మీరు ఆ కుక్కను బుజ్జగిస్తారు. "ఇది దొంగలని బాగా తరుముతుంది. రేపణ్ణుంచి ఇంకొంచం అన్నం దానికి పడేస్తూండు" అని మీ భార్యతో అంటారు. ఆ కుక్క పుణ్యం పుచ్చింది!

మనుషులలోకూడా - ముఖ్యంగా నలభైయేళ్ళు పైబడిన వార్ధక్య దశలో ప్రవేశించినవారిలో - ఈ కుక్క స్వభావమే కనిపిస్తుంది. మీరు బాగా గమనించి చూశారా?

---

# అందమైన చీరలు - అతివల సౌమ్ము

ఆమధ్య ఒక పాశ్చాత్య రచయిత భారతీయ స్త్రీలు ధరించే చీరలను చూసి రాశాడు: "ప్రపంచంలో అన్నిజాతుల స్త్రీలు ధరించే దుస్తుల రకాలన్నిట్లోనూ ఇండియన్ స్త్రీలు ధరించే చీరలు ఎంతో ఆకర్షణీయంగా వుంటాయి" అని.

* * *

అంతటితో ఆగకుండా ఆరచయితే ఇంకా ఇలా రాసాడు—"ఇండియన్ స్త్రీలు రంగురంగుల చీరలు ధరించి ఆకాశంమీద అప్పుడప్పుడు కనిపించే ఇంద్రధనుస్సును మించిన ఆకర్షణను కలిగి వుంటారు. ఈ ఆకర్షణతో వాళ్ళు తమ మొగవాళ్ళను బంధించేస్తారు. మా పాశ్చాత్య దేశాల్లో స్త్రీలు గౌన్లు ధరిస్తారు. ఇవి అట్టే అందంగా వుండవు. ఇంద్రధనుస్సునుపోలిన రంగులు పాశ్చాత్యస్త్రీల ఉడుపులలో సాధారణంగా